బలగం
BALAGAM
TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 15 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

## ఎప్‌సెట్ వెబ్‌ఆప్షన్లలో మార్పులకు నేడే ఆఖరు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్‌ఆప్షన్లలో మార్పు, చేర్పులకు మంగళవారమే చివరి రోజు. రాష్ట్రంలో 95,256 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిలో 94,059 మంది అభ్యర్థులు 56,63,308 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో 83,054 సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈనెల 12న 77,154 (92.89 శాతం) మంది అభ్యర్థులకు సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఇంకా 5,900 (7.11 శాతం) సీట్లు మిగిలాయి. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం, ఇతర కారణాల వల్ల 16,905 మందికి సీట్లు కేటాయించలేదు. మంగళవారం వరకు మాక్ కౌన్సెలింగ్ వెబ్‌ఆప్షన్లలో మార్పు, చేర్పులకు అవకాశం కల్పించింది. వాటినే ఎప్‌సెట్ మొదటి విడత వెబ్‌ఆప్షన్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. ఒకవేళ ఆప్షన్లను మార్చుకుంటే వాటినే ఎప్‌సెట్ మొదటి విడత ఆప్షన్లుగా పరిగణిస్తామని తెలిపింది. ఈనెల 18న ఎప్‌సెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని ప్రకటించింది. ఇతర వివరాలు, వెబ్‌ఆప్షన్ల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.


ఫైల్‌ఫోటో

# రేపు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ

- **కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన అపెక్స్ కమిటీ భేటీ**
- **గోదావరి-బనకచర్లతో పాటు రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృత అంశాలపై చర్చ**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కృష్ణా, గోదావరి నదీ బేసిన్ల పరిధిలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై చర్చించేందుకు బుధవారం అపెక్స్ కమిటీ భేటీ జరగనుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం జరగనున్న ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. అలాగే జల వనరుల శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. కృష్ణా, గోదావరి నదీ జలాలను వినియోగిస్తూ చేపట్టిన కొత్త ప్రాజెక్టులు, బోర్డుల వర్కింగ్ మాన్యువల్, రెండు బేసిన్లలో నీటి వినియోగం, వృథా నీటి వాడకానికి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టులపై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించనున్నారు. కాగా... గోదావరి-బనకచర్లకు అనుమతివ్వాలని ఏపీ ప్రభుత్వం పట్టుబడుతోంది. సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో గతనెల 19న కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ(ఈఏసీ) భేటీలో బనకచర్ల అంశంపై చర్చించారు. అయితే ఈ ప్రాజెక్ట్‌పై కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు రాలేదు. దీంతో చంద్రబాబు నాయుడు ఎలాగైనా అనుమతులు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా... ఆంధ్రప్రదేశ్ చేపట్టే గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌ను తొలి నుంచి తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌తో ఎగువ రాష్ట్రమైన తెలంగాణ తీవ్ర అన్యాయం జరుగుతోన్న విషయాన్ని ఇప్పటికే పలు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఇందులో భాగంగా ఈ ఏడాది జూన్ 19, మార్చి 3 తేదీల్లో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం త్వరలో అపెక్స్ కమిటీ భేటీ నిర్వహిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగానే బుధవారం అపెక్స్ కౌన్సిల్ భేటీ కానుంది.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారని తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలుపుతోంది. ఇదే విషయాన్ని కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు కంప్లైంట్ చేసింది. ఈ పథకానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కేంద్ర జల సంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేఆర్ఎంబీల నుంచి ఎటువంటి అనుమతి లేదని పేర్కొంది. గోదావరిపై తాము చేపట్టిన సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వని విషయాన్ని కేంద్రానికి గుర్తు చేసింది. ప్రధానంగా కృష్ణా నది పరివాహకంలో సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున కృష్ణా జలాల్లో

మిగితా 4వ పేజీలో

# హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

- **త్రిపుర నుంచి బదిలీ**
- **రాష్ట్రపతి ఆమోదం**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ప్రస్తుతం తాత్కాలిక సీజేగా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సూచనలు చేసింది. ఇంతకుముందు త్రిపుర హైకోర్టు సీజేగా విధులు నిర్వహించిన జస్టిస్ ఏ.కె.సింగ్ (అపరేష్ కుమార్ సింగ్) సుదీర్ఘ న్యాయ అనుభవాన్ని కలిగినవారు.



తెలంగాణ హైకోర్టు సీజేగా నియమితు లైన అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. అనంతరం 1990 నుంచి 2000 వరకూ ఉత్తర్ ప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార?ండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకూ జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి సాధించారు. కాగా, తాజాగా తెలంగాణ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్



- **35 మంది విద్యార్థినులకు అస్వస్థత**
- **దేవరకొండ తూర్పుపల్లి ఆస్పత్రికి తరలింపు**
- **నిలకడగా బాలికల ఆరోగ్యం**

**బలగం టీవి, దేవరకొండ**

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం ఫుడ్ పాయిజన్ అయ్యింది. ఆదివారం రాత్రి అల్పాహారంగా పెసర గుగ్గిళ్ల, అనంతరం భోజనంగా బగారా రైస్, చికెన్ వడ్డించగా.. రాత్రి తర్వాత కొంతమంది విద్యార్థినులకు కడుపునొప్పి, విరేచనలు మొదలయ్యాయి. తర్వాత రోజు సోమవారం ఉదయం పులిహోర వడ్డించాక 35 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన టీచర్లు పాఠశాలలోని ఏఎన్ఎం సాయంతో ముదిగొండ గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్‌ను సంప్రదించారు. ఆయన సూచన మేరకు విద్యార్థినులను ఆసుపత్రికి తరలించారు.

**13 మంది దేవరకొండ, 22 మంది తూర్పుపల్లి పీహెచ్‌సీలో**

ఇటీవల అస్వస్థతకు గురైన విద్యార్థినులలో 13 మందిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో, 22 మందిని తూర్పుపల్లి పీహెచ్‌సీలో చేర్చినట్టు అధికారులు తెలిపారు. ఇద్దరు ఆసుపత్రులలో చికిత్స

మిగితా 2వ పేజీలో

## ప్రజా ప్రభుత్వం రెండున్నరేండ్లు పూర్తి చేసుకునే లోపు

# లక్ష ఉద్యోగాల భర్తీ

- **కాళేశ్వరం కూలేశ్వరం అయింది**
- **ప్రాజెక్టులపై నాగార్జునసాగర్ పై చర్చిద్దామా..?**
- **తులసీవనంలో గంజాయి మొక్కలను పీకేయండి**
- **మేడిగడ్డ కూలిన చోట బీఆర్ఎస్ నేతలను ఉరి తీసినా తప్పు లేదు**
- **తుంగతుర్తికి గోదావరి జలాలు తీసుకొస్తా**
- **2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం**
- **త్వరలోనే స్థానిక ఎన్నికలు**
- **ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి**
- **సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ**






**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అధికారం చేపట్టిన ఏడాది కాలంలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన ప్రభుత్వం రెండున్నరేళ్ల కాలం పూర్తయ్యేలోగా మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల కుటుంబాలు ఆత్మగౌరవంతో బతికే విధంగా వారికి ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసానిచ్చారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన రేషన్ కార్డుల పంపిణీని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, ప్రభుత్వ సలహాదారులు, లోక్ సభ సభ్యులు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారితో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అశేషంగా హాజరైన ప్రజలను ఉద్దేశించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పోరాటాల ఈ గడ్డ నుంచి తెలంగాణ పేద ప్రజలకు రేషన్ కార్డులు పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉంది. భూమి కోసం భుక్తి కోసం, విముక్తి కోసం పోరాటాలు సాగించిన గడ్డ ఇది. రావి నారాయణరెడ్డి అత్యధిక మెజారిటీని ఇచ్చి దేశానికే సాయుధ రైతాంగ పోరాట శక్తిని చాటిచెప్పిన ప్రాంతం. ఈ జిల్లా చరిత్రనే తెలంగాణ చరిత్ర అంటే అతిశయోక్తి కాదు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు కోరినట్టుగా, తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్యాకేజీ 6 నుంచి గోదావరి జలాలను తరలించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే వరకు ప్రభుత్వం విశ్రమించదని మాట ఇస్తున్నా. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి, ఇప్పుడు తుంగతుర్తిలో రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టాం. గడిచిన పదేళ్లలో పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇవ్వాలని ఆలోచన చేయలేదు. ఈరోజు రేషన్ షాపుల వద్ద క్యూలైన్లలో నిలబడి కోట్లాది మంది సన్నబియ్యం తీసుకుంటున్నరు.

వ్యవసాయం దండగ కాదు. పండుగ చేయాలన్న లక్ష్యంతోనే రైతాంగానికి అండగా నిలవాలని 21 వేల కోట్ల రూపాయలతో 25,55,968 లక్షల మందికి 2 లక్షల చొప్పున రుణమాఫీ చేశాం. పంటలకు కనీస మద్దతు ధరతో పాటు సన్నవడ్లు పండిస్తే రూ.500 బోనస్ చెల్లిస్తున్నాం. 1.49 లక్షల ఎకరాలకు 70 లక్షల మంది రైతులకు 9 రోజుల్లో 9 వేల కోట్ల మేరకు రైతు భరోసా వేయడం ద్వారా వారి కళ్లల్లో ఆనందం చూసినం. పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పాం. దాంతో ఏడాది తిరిగేలోపు 2.85 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి దేశంలోనే రికార్డు సాధించాం. రైతు భరోసా, రుణమాఫీ, కనీస మద్దతు ధర, రేషన్ కార్డు కావొచ్చు.. రైతులు సంతోసంగా ఉన్నప్పుడు తెలంగాణ ఒక పండుగ జరుపుకుంటుంది. రేషన్ కార్డులలో దాదాపు 26 లక్షల మందికి పేర్లు మార్చుకునే అవకాశం ఇచ్చాం. పేదవాడి ఆత్మగౌరవం, ఆకలి తీర్చే ఆయుధంగా పనిచేస్తుందని ఆలోచన చేసి లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరే విధంగా రేషన్ కార్డులను జారీ చేస్తున్నాం.

రాష్ట్రంలోని 67 లక్షల స్వయం సహాయక సంఘాల ఆడబిడ్డలకు పండుగ పూట ప్రతి ఆడబిడ్డకు రెండు చీరల చొప్పున ఇవ్వాలని నిర్ణయించాం. జీరో వడ్డీతో 21 వేల కోట్ల మేరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తున్నాం. ఆర్టీసీలో ఆడబిడ్డకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు వెయ్యి బస్సులిచ్చి కిరాయికి ఇచ్చే విధంగా అవకాశం ఇచ్చాం. 200 యూనిట్ ఉచితంగా ఇవ్వడమే కాకుండా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఆడబిడ్డలకు ఇస్తున్నాం. అలాగే జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్ లు నడిపించే బాధ్యత ఇచ్చాం. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో వాటిని నిర్వహించే బాధ్యత ఇచ్చాం. దేశంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో కులగణన పూర్తి చేయడం ద్వారా వచ్చే జనగణనలో కులగణన చేసే విధంగా ఒత్తిడి తెచ్చి తలొగ్గే విధంగా చేయగలిగాం. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నాం.." అని వివరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి గారి చేతుల

మిగితా 2వ పేజీలో

## తెలంగాణ రైజింగ్‌లో సినిమా రంగానికి ప్రత్యేక స్థానం

- **సీఎం రేవంత్ రెడ్డి**
- **శ్రీమద్భాగవతం సినిమా ముహూర్తం క్లాప్ కొట్టిన ముఖ్యమంత్రి**

వివరాలు 4వ పేజీలో

# రైతులపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తోంది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తోంది" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలన వ్యవసాయాన్ని దండగ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు బీఆర్ఎస్ హయాంలో ఎత్తిపోయి రైతులకు లాభపడినప్పటికీ, ఇప్పుడు అదే నీళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎక్స్‌లో (ట్విటర్‌లో) కేటీఆర్ ఈ మేరకు పోస్ట్ చేస్తూ.. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యమే రైతుల కన్నీళ్లకు కారణమని అన్నారు. "అద్దాల మేడలో ఊరేగుతున్న అబద్దాల కాంగ్రెస్ మూలంగా రైతన్న అంధకారంలోకి నెట్టబడుతున్నాడు. దశాబ్దాలుగా దండగ అయిన వ్యవసాయాన్ని బీఆర్ఎస్ పండగగా మార్చితే, ఏడాదిన్నరలోనే కాంగ్రెస్ మళ్లీ దండగ చేసింది" అని విమర్శించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా గతంలో సుమారు 600 మీటర్ల ఎత్తు నుంచి నీళ్లు ఎగిసిపోతూ, 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం రావిచెరువు వరకు చేరాయన్నారు. 2001లో పూర్తి చేసిన కాకతీయ కాలువ చివరి ఆయకట్టుకు కాళేశ్వరం నీళ్లతోనే 22 ఏళ్ల తర్వాత సాగునీరు అందిందని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు మేడిగడ్డ, కన్నెపల్లి పంప్ హౌస్ వంటి కీలక ప్రాంతాల్లో మరమ్మతులు చేయకుండా, నీళ్లు ఎత్తిపోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని చాటుతోందన్నారు. వ్యవసాయంపై కక్షగట్టిన కాంగ్రెస్ రైతన్నలకు శిక్ష వేస్తోందని మండిపడ్డారు. "కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కొంటాం. తెలంగాణ రైతన్నలను కాపాడేందుకు బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుంది" అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు.



# కర్షకుల ప్రభుత్వమే కాంగ్రెస్



- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల**
- **2.5 లక్షల ఎకరాలకు సాగునీరు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"కాంగ్రెస్ సర్కార్ అంటేనే కర్షకుల ప్రభుత్వమని" డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమమే ప్రథమ ధ్యేయం, వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులే మా ప్రభుత్వం మార్గదర్శక సూత్రాలు. గత పాలనలో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టినప్పటికీ, ఇప్పుడు ఆ తప్పిదాల మూల్యాన్ని మేమే చెల్లిస్తున్నాం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

"శ్రీశైలంపై ఏపీ ప్రాజెక్టులు కడుతుంటే అప్పటి సీఎం కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ఆయనే

మిగితా 2వ పేజీలో

## తిరుపతిలో రైలు బోగీలో మంటలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తిరుపతి రైల్వేస్టేషన్‌లో హిసార్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగి ఓ బోగీ పూర్తిగా కాలిపోయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రాజస్థాన్ నుంచి హిసార్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి రైల్వే స్టేషన్‌కు సోమవారం ఉదయం 11.50లకు చేరుకుంది. ప్రయాణికులు స్టేషన్‌లో దిగిన తర్వాత.. రైలు యార్డులోకి వెళ్లే క్రమంలో ఇంజిన్ వైపు ఉన్న బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో పక్క ట్రాక్‌పై ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగీలోకి మంటలు వ్యాపించాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



## మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మూడు రాష్ట్రాలకు గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవా గవర్నర్‌గా టీడీపీ నేత ,మాజీమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. హర్యానా గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్, లద్దాక్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తాలను రాష్ట్రపతి నియమించారు. విజయనగరానికి

మిగితా 2వ పేజీలో

# అందరూ జాగ్రత్తగా ఉండాలి

- అగ్నిప్రమాదాలు జరుగుతాయి
- రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుంది
- ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయి
- స్వర్ణలత భవిష్యవాణి

బలగం టీవి, హైదరాబాద్

సికింద్రాబాద్‌లో ఘనంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. బోనాలు పండుగ తర్వాతి రోజు జరిగే రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. భక్తులు సమర్పించిన బోనాలను సంతోషంగా అందుకున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుంది. అందరూ జాగ్రత్తగా ఉండాలి. మీరు పాటించాల్సినవి పాటించండి. అగ్నిప్రమాదాలు జరుగుతాయి. ముందే హెచ్చరిస్తున్నా అని చెప్పారు. ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయని చెప్పారు. తాను కోపంగా లేనని.. తాను కన్నెర్ర చేస్తే రక్తం కక్కుకుంటారు అంటూ స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

'ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయి... పాడి పంటలు సమద్ధిగా పండుతాయి.... కానీ రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుంది, అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయి... జాగ్రత్తగా ఉండాలి' మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. అలాగే 'నాకు పూజలు చేసి రక్తం చూపించండి' అని అన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం వేడుకల్లో ప్రధాన ఘట్టమైన 'రంగం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పచ్చికుండపై నిలబడి మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. మహంకాళి బోనాల ఉత్సవంతో సంతప్తి చెందావా తల్లీ?.. అని అర్చకులు ఆమెను అడగగా, అందుకు మాతంగి సమాధానం చెబుతూ.. 'ప్రజలంతా డప్పుచప్పుళ్లతో ఆనందోత్సాహాల నడుమ తనకు బోనాలు సమర్పించారు. వచ్చిన ప్రతి బోనాన్ని తాను సంతోషంగా అందుకున్నాను. ఈసారి చాలా సంతోషంగా పూజలు చేశారు, మీ అందరినీ సంతోషంగా సమానంగా చూస్తాను. మీ అరికాలిలో ముల్లు నాలుకతో తీస్తాను. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారు, నేను అడ్డురాను" అని భవిష్యవాణి వినిపించారు. "బాలబాలికలను మీరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారు.. కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాను. కానీ, ప్రతి ఏటా ఉత్సవానికి ఏదో ఒక ఆటంకం కల్పిస్తున్నారు.. నన్ను ఎవరూ లెక్కచేయడం లేదు' అని ఆగ్రహించారు. 'రాశులకొద్దీ రప్పించుకుంటున్నారు... గోరంతైనా తనకు దక్కడం లేదు, నాకు సక్రమంగా పూజలు చేయడం లేదు.. మీరు నన్ను సరిగ్గా చూసుకోవడం లేదు.. అయినా నేను అందరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నా' అని అన్నారు. 'జరుగుతున్న పరిణామాలకు నా పాత్ర ఉంటుంది.. నా రూపాన్ని పెట్టడానికి కూడా అడ్డుపడుతున్నారు... నాకు ఎవరైతే ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తారో వాళ్లు రక్తం కక్కుకుంటారు. నాకు పూజలు చేసి రక్తం చూపించండి.. నాకు తప్పనిసరిగా అన్ని విధివిధానాల ప్రకారం



పూజలు జరిపించండి. ఏటికొక్కసారి నాకు ఇలా పూజలు జరిపించాలి. నన్ను కొలిచే నా అక్కచెల్లెలు అందరికీ అండదండగా ఉంటాను' అని అన్నారు.

ఇక సాయంత్రం అంబారీ ఊరేగింపు ఉంటుంది. ఈసారి ఊరేగింపు కోసం కర్నాటక తుముకూరులోని శ్రీ కరిబసవ స్వామి మఠం నుంచి ఏనుగును తీసుకొచ్చారు.

రంగం కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో దేవాదాయ శాఖ తరుపున శాస్త్రీయంగా జరగాల్సిన అన్ని రకాల పూజలు వచ్చే ఉత్సవాల నుంచి విధిగా నిర్వహిస్తామని హైదరాబాద్ జిల్లా ఇంచార్జిమంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అమ్మ వారికి గతంలో ఆగిపోయిన బలి రక్తం కార్యక్రమాన్ని అమ్మవారు కోరిన విధంగా తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి చెప్పారు. 1815 సంవత్సరంలో ఏర్పడిన అమ్మవారి దేవాలయంలో భక్తుల కోసం అన్ని రకాల వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. అమ్మవారి అనుగ్రహం, భక్తుల సహకారంతో ఉజ్జ యిని మహంకాళి బోనాల ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆలయంలో నిర్వహించిన భవిష్యవాణి కార్యక్రమం అనంతరం మంత్రిపొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా లక్షలా ది మంది బోనాలు సమర్పించారని, తమపై అమ్మ వారి చల్లని దీవెనలు ఉండాలని, రాబోయే కాలం లో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మ వారిని భక్తులు కోరుకున్నారన్నారు. భవిష్యవాణిలో అమ్మవారు కోరిన విధంగా ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎక్కడ, ఎలాంటి సమస్యలు లేకుండా అమ్మవారి ఆశీర్వాదంతో కా ర్యక్రమాలు విజయవంతంగా జరిగాయని, భక్తుల సహకారం మరువలేనిదని మంత్రి వెల్లడించారు. ఈ రంగం కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, డిసిపి రష్మీ పరిమల్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, దేవాలయ చైర్మన్ రామేశ్వర్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఈవో మనోహర్ రెడ్డి, హక్కుదారులు, కమిటీ సభ్యులు, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష ఉద్యోగాల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

మీదుగా రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకురాని ముఖ్యమంత్రిని అడ్డుకుంటామని సూర్యాపేట ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ.. మూడ్రోజులు సమయం ఇస్తే గోదావరి జలాలు తెస్తానని గొప్పలు పలికిన ఆయన పదేండ్లు అధికారంలో ఉండి గడ్డి పీకారా? అని ప్రశ్నించారు. వాళ్లు దేవాదుల నుంచి కూడా నీళ్లు తేలేదన్నారు. 'మూడు అడుగుల జగదీశ్‌రెడ్డి.. గోదావరి జలాలు తేవడం అంటే గ్లాస్‌లో సోడా కలపడమా.. నా కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ప్రగల్భాలు పలుకుతున్నావు.. తుంగతుర్తి గడ్డ మీద సవాల్ విసురుతున్న.. మా దామన్న ఒక్కడు చాలు నీ కథ ఏందో చూడటానికి' అని అన్నారు. తులసీవనంలో గంజాయి మొక్కలా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలకుగాను ఇక్కడ ఒక్క చోట గెలిచావు.. వచ్చే ఎన్నికల్లో గంజాయి మొక్కను పీకే బాధ్యత మా అక్కలదే అని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల, గ్రామస్థాయిలో అన్ని చోట్లా గెలిపించే బాధ్యత పార్టీదేనని, ఒక్క గంజాయి మొక్క కూడా గెలవడానికి వీల్లేదని ఆ బాధ్యత మీరే తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. రూ.50 వేలతో తుంగతుర్తికి వస్తే 60 వేల మెజార్టీతో సామెల్‌ను గెలిపించారని, ఏ ఎన్నికల్లో అయినా నేతలను గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుం దని చెప్పారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని అన్నారు. "బీఆర్ఎస్ నేతలంతా కట్టకట్టుకుని రండి.. మీరంతా ఒకవైపు.. మా కాంగ్రెస్ కార్యకర్తలు ఒకవైపు" అని సవాల్ విసిరారు.

త్వరలోనే గ్రామపంచాయతీ ఎన్నికలు రానున్నాయని, తమ ప్రభుత్వం దేశంలోనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఏకైక రాష్ట్రమని సీఎం చెప్పారు. రాష్ట్రంలో జనగణన, కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5.6 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీతో పాటు, 26 లక్షల మంది పేర్లను కార్డుల్లో చేర్చడం ద్వారా మొత్తం 3 కోట్లా 10 లక్షల మందికి సన్నబియ్యం అందించనున్నామని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా గడిచిన పదేండ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, సన్నబియ్యంతో అన్నం పెట్టాలన్న ఆలోచన చేయలేదని చెప్పారు. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామనీ, తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేశామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 70 సంవత్సరాలు గడిచినా చెక్కుచెదరలేదని, మూడేండ్లలో కట్టిన కాళేశ్వరం మాత్రం అప్పుడే కూలిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులే ఇప్పుడు రైతులను ఆదుకుంటున్నాయన్నారు.మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాల్లోని ప్రతి ఆడబిడ్డకూ రెండు చీరలు ఇస్తున్నామని, రూ.21 వేల కోట్లు జీరో వడ్డీతో బ్యాంకు రుణాలు ఇప్పించామని సీఎం అన్నారు. 600 బస్సులు కొనుగోలు చేసి మహిళల ద్వారా ఆర్టీసీకి కిరాయికి ఇప్పించి వారిని యజమానులను చేశామని తెలిపారు. మహిళల ద్వారానే సోలార్ విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేసే విధంగా 1000 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు ఇస్తున్నామన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ద్వారా గోదావరి జిల్లాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేస్తామని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాలువలను పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్‌గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్ పాల్గొన్నారు.

# సర్కారు బడుల్లో సంగీత పాఠాలు

## 270 పీఎంశ్రీ స్కూళ్లలో అమలు

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుతోపాటు సంగీత పాఠాలను కూడా నేర్చుకోనున్నారు. పీఎంశ్రీ కింద ఎంపికైన 270 సర్కారు బడుల్లో సంగీత పాఠాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాటికి ఇప్పటికే సంగీత వాయిద్య పరికరాలను సరఫరా చేసింది. తబలా, మృదంగం, హార్మోనియం, వయోలిన్ వంటి వాటిని నేర్పిస్తారు. దీంతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారు. చదువుతోపాటు క్రీడలు, సంగీతంలోనూ రాణించేందుకు ఇది దోహదపడుతుంది. రాష్ట్రంలో పీఎంశ్రీ కింద 832 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో 82 ప్రాథమిక, 30 ప్రాథమికోన్నత, 472 ఉన్నత, 210 హయ్యర్ సెకండరీ, 29 కేవీలు, తొమ్మిది నవోదయ పాఠశాలలున్నాయి. అందులో 270 స్కూళ్లలో చదివే విద్యార్థులకు సంగీత పాఠాలను అందించనున్నారు. సంగీత పాఠశాలను నేర్పించే ఉపాధ్యాయుల నియామకం ప్రక్రియ జరుగుతున్నది. ఒక్కో టీచర్‌కు నెలకు రూ.పది వేల చొప్పున ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఆర్నెల్లపాటు వారు సంగీత పాఠశాలను నేర్పించాల్సి ఉంటుంది. అయితే విద్యాశాఖ అధికారులు సంగీత టీచర్ల నియామకంపై మల్లగుల్లాలు పడుతున్నారు. తబలా, మృదంగం, హార్మోనియం, వయోలిన్ వంటి వాటిలో ఒక టీచర్‌కు ఒక సంగీత వాయిద్యంపైనే అవగాహన ఉన్నది. ఒక టీచర్‌ను నియమిస్తే ఒక వాయిద్యం మాత్రమే నేర్పించే అవకాశమున్నది. నాలుగు సంగీత వాయిద్యాలను నేర్పించాలంటే ఏం చేయాలన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఏం చేస్తారో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సిందే. పీఎంశ్రీ కింద ఒక్కో పాఠశాలకు రూ.2.25 కోట్ల వరకు ఖర్చు చేయడానికి అవకాశమున్నది. ఇందులో 60 శాతం కేంద్రం, 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాలి. 2022-23లో ప్రవేశపెట్టిన ఈ పథకం 2026-27 వరకు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్న ఈ పథకం లక్ష్యం.

# కర్షకుల ప్రభుత్వమే కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా కేటీఆర్, హరీశ్‌రావు చేసిన తప్పులే నేడు రాష్ట్రానికి భారం అవుతున్నాయి. అలాంటి వారు ఇప్పుడు మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు ఈ వాస్తవాన్ని గుర్తించాలి" అని భట్టి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా, రైతు పథకాల అమలులో ఏమాత్రం వెనుకడుగు వేయట్లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. "రైతు భరోసా ద్వారా ఒక్కో ఎకరాకు రూ.12,000 చొప్పున మంజూరు చేశాం. తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో

రూ.9 వేల కోట్లను జమ చేశాం. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చాం. త్వరలోనే మిగిలిన పంటలకు కూడా ఇస్తాం" అని హామీ ఇచ్చారు.

"గత ఏడాది వరదల కారణంగా నష్టపోయిన సాగర్ మెయిన్ కెనాల్‌ను పూర్తిగా పునరుద్ధరించాం. ఇప్పుడు నాగార్జునసాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తున్నాం. ఇప్పటికే 2,55,324 ఎకరాలకు సాగునీరు ఇచ్చాం. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటి ఆధారంగా మొదటి పంటకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. వరుణ దేవుడి ఆశీస్సులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వున్నాయని ఇది శుభసూచకం" అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని మంత్రులు విడుదల చేశారు. రెండో జోన్‌కు చెందిన 2.5 లక్షల ఎకరాలకు 1500 క్యూసెక్కుల నీటిని అందించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్

(మొదటి పేజీ తరువాయి)

పొందిన విద్యార్థినుల ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని వైద్యులు వెల్లడించడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

విషయం తెలుసుకున్న ఆర్డీఓ రమణారెడ్డి ఆసుపత్రిని సందర్శించి విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఇతర అధికారులు స్పందించినా గిరిజన సంక్షేమ శాఖ డీటీడబ్ల్యూఓ ఇప్పటికీ స్పందించకపోవడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచే ఘటన జరగినా, మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అధికారిని చూడలేదని వారు ఆగ్రహం వ్యక్తం

# మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చెందిన అశోక్ గజపతి రాజు టీడీపీలో ఉన్నారు. గతంలో ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. తాజాగా ఆయనను గోవా గవర్నర్‌గా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయకు ఉద్వాసన పలికారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పని చేసిన ఆయనను తొలుత హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమించారు. ఆ తరువాత హర్యానా గవర్నర్‌గా నియమించారు. తాజాగా ఆయన స్థానంలో కొత్త గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్‌ను నియమించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఈయన ప్రొఫెసర్‌గా ఉన్నారు. అదే విధంగా లద్దాక్ లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి బిడి మిశ్రా (రిటైర్డ్) చేసిన రాజీనామాను రాష్ట్రపతి ముర్ము ఆమోదించారనీ, ఆయన స్థానంలో కవిందర్ గుప్తాను నియమించారని రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ప్రకటన తెలిపింది. రాష్ట్ర హోదా, ఇతర రాజ్యాంగ రక్షణలను డిమాండ్ చేస్తూ లద్దాక్ అపెక్స్ బాడీ ప్రకటించిన తాజా ఆందోళనల నేపథ్యంలో గుప్తా నియామకం జరిగింది. కాగా.. రాష్ట్రానికి ప్రథమ పౌరుడిగా భావించే గవర్నర్ పదవిని చేపట్టిన వారిలో తెలుగువారు చాలా మందే ఉన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాల రాజ్‌భవన్‌లో తెలుగువారు గవర్నర్లుగా ఆశీనులయ్యారు. అందులో తెలుగురాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు గా చేసిన ప్రముఖులూ ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇప్పటి వరకూ మొత్తం 20 మంది వివిధ రాష్ట్రాలకు గవర్నర్లుగా పనిచేశారు. అలాగే ఒడిశా, తమిళనాడులోని తెలుగు కుటుంబాల్లో జన్మించిన ఇద్దరితో పాటు తెలుగింటి కోడలుగా వచ్చిన ఒకరు కూడా గవర్నర్లుగా పని చేశారు. అంతేకాకుండా వీరిలో పలువురు ఏకకాలంలో వివిధ రాష్ట్రాల్లో గవర్నర్లుగా ఉన్నారు.

# హరి హర వీరమల్లు సెన్సార్ పూర్తి

బలగం టీవీ, హైదరాబాద్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1 – స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని యూ/ఏ సర్టిఫికేట్ పొందింది. సినిమా రన్ టైమ్ 2 గంటల 42 నిమిషాలు. జులై 24న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం జులై 20న విశాఖపట్నంలో భారీ ఎత్తున ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రానికి క్రిష్ జాగర్లమూడి కొంత భాగం దర్శకత్వం వహించగా, మిగతా పార్ట్ ను ఏఎం జ్యోతికృష్ణ పూర్తిచేశారు. ఏఎం రత్నం నిర్మాణంలో రూపొందిన ఈ సినిమా, చారిత్రక నేపథ్యంలో యుద్ధ సన్నివేశాలు, భావోద్వేగ క్షణాలతో ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్‌తో పాటు నిధి అగర్వాల్, బాబీ డియోల్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఒక పవర్ ఫుల్ సాంగ్ తో పాటు చిత్ర నిర్మాణ వీడియోను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపేలా ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రం, కన్నులపండుగలా ఉంటుందని అంచనా. మూడేళ్ల తర్వాత పవన్ కల్యాణ్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనుండటంతో అభిమానులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

# కె-ర్యాంప్ గ్లింప్స్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్




టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం బర్త్‌డే సందర్భంగా అభిమానులకు కొత్త గిఫ్ట్ ఇచ్చాడు. తాజాగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం "కె-ర్యాంప్" గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో కిరణ్ బాడీ లాంగ్వేజ్, స్టైల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కె-ర్యాంప్ సినిమా అక్టోబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో లుంగీ కట్టుతో సింపుల్ లుక్‌లో కిరణ్ కనిపించి ఆకట్టుకున్నాడు. ఈ చిత్రంలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తుండగా, జెయిన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతాన్ని చేతన్ భరద్వాజ్ అందిస్తున్న ఈ చిత్రం, కిరణ్-చేతన్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రం కావడం విశేషం. ఈ కాంబినేషన్‌లో ఇప్పటికే "ఎస్ఆర్ కళ్యాణమండపం", "వినరో భాగ్యము విష్ణు కథ" సినిమాలు వచ్చిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం "కె-ర్యాంప్" సెట్స్ మీద ఉండగా, మరో ప్రాజెక్ట్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు కిరణ్. ప్రముఖ దర్శకుడు రవి నంబూరి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి "బేబీ" డైరెక్టర్ సాయి రాజేష్ కథ అందిస్తుండగా, ఎస్‌కేఎన్ నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. "చెన్నై లవ్ స్టోరీ" అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌కి మంచి స్పందన లభించడంతో, మణిశర్మ సంగీతం సినిమాపై అంచనాలను పెంచుతోంది.

# రేపు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని తెలంగాణ డిమాండ్. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలు తేల్చిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని ఇప్పటికే తేల్చి చెప్పింది. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాతంగా ఏపీకి 66, తెలంగాణకు 34 శాతం నీటి కేటాయింపులు చేసిన విషయాన్ని కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే తెలిపారు. ఏండ్లుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది సైతం ఆంధ్రప్రదేశ్ తమకు కేటాయించిన మొత్తానికి మించి నీరు తరలించుకు పోయిందన్నారు. ఇక ముందు తమ వాటాకు మించి కృష్ణానది నీటిని ఏపీ తరలించుకొని పోకుండా చూడాలని పట్టుబడుతోంది.

శాశ్వత సమస్య అయిన కృష్ణా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యూనల్ వ్యవహారంలో విచారణను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ కోరుతోంది. అలాగే ముచ్చిమర్రి నుంచి ఏపీ తరలిస్తోన్న నీటిని ఆపాలని, నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి 10 వేల క్యూసెక్‌లను ఏపీ తీసుకుపోతోన్న వైఖరిని తప్పుబడుతోంది. మరీ ముఖ్యంగా కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం, నాగార్జున సాగర్‌తో పాటు ఇతర పాయింట్లలో టెలిమెట్రీ పరికరాలు వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోంది. ఈ టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకయ్యే ఖర్చులో అవసరమైతే తెలంగాణ, ఏపీ ఇద్దరి వాటాను తెలంగాణనే భరించేందుకు సిద్ధమని ఇప్పటికే స్పష్టం చేసింది. అందువల్ల వెంటనే టెలిమెట్రీ పరికరాలు అమర్చాలని, దీంతో అక్యురేట్ మెజర్‌మెంట్స్ వస్తాయని కేంద్రాన్ని కోరుతోంది. ఇక తెలంగాణకు కీలకమైన పాలమూరు- రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, మోడి కుంట వాగు, చనాఖా కొరటా బ్యారేజీ (డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్), చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు సత్వర సాగు నీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ).. పీఎంఆర్‌పీ 2024 కింద తగిన ఆర్థిక సహాయం అందజేయాలని కోరుతోంది.

# లార్డ్స్‌లో భారత్ అనూహ్య ఓటమి

- **22 పరుగుల తేడాతో నెగ్గిన ఇంగ్లండ్ జట్టు**
- **జడేజా ఒంటరి పోరాటం వృథా**

బలగం టీవీ, హైదరాబాద్



ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో టీమిండియాకు మరో ఓటమి ఎదురైంది. లార్డ్స్ వేదికగా సోమవారం ముగిసిన మూడో టెస్ట్‌లో భారత్ 22 పరుగుల తేడాతో అనూహ్యంగా ఓటమిపాలైంది. 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు కుప్పకూలింది. టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ ఘోరంగా విఫలమవడంతో జడేజా ఒంటరిగా పోరాడాల్సి వచ్చింది.

ఒక వైపు వికెట్లు కుప్పకూలుతున్నా.. మరోవైపు రవీంద్ర జడేజా (61 నాటౌట్‌బీ 181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో విజయాన్ని చేజార్చాడు. కేఎల్ రాహుల్ (39) మినహా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ (3/55), బెన్ స్టోక్స్ (3/48) మూడేసి వికెట్లు తీసారు. బ్రైడన్ కార్స్ (2/30), షోయబ్ బషీర్, క్రిస్ వోక్స్ చెరో వికెట్ సాధించారు. దీంతో భారత బౌలర్ల అద్భుత ప్రదర్శన వృథా అయింది. ఈ విజయంతో ఇంగ్లండ్ సిరీస్ 2-1తో ముందంజలో ఉంది. నాలుగో టెస్ట్ జులై 23 నుంచి మాంచెస్టర్‌లో ప్రారంభంకానుంది.

ఓవర్‌నైట్ స్కోర్ 58/4తో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కి ఆరంభం నుంచే ఎదురుదెబ్బ తగిలింది. రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్ వరుసగా ఔటవ్వడంతో 80 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ఇక అక్కడి నుంచి జడేజా నితీష్ కుమార్ రెడ్డి, బుమ్రా, సిరాజ్‌లతో కలిసి పోరాడినప్పటికీ విజయం చేజారింది. భారత బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడంతో ఇంగ్లండ్ ఆటగాళ్లు వారిని కవ్వించేందుకు ప్రయత్నించారు. హ్యారీ బ్రూక్, బట్లర్‌లు నితీష్ రెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఇదంతా వారి ఏకాగ్రత దెబ్బతీసే ప్రయత్నంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ టెస్టులో జడేజా నాలుగో అర్ధసెంచరీని నమోదు చేశాడు. చివరి వరకు క్రీజులో ఉండే ప్రయత్నం చేసిన జడేజా, సిరాజ్‌తో కలిసి చివరి వికెట్‌కు 23 పరుగులు జోడించాడు. అయితే షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సిరాజ్ ఔటవ్వడంతో భారత్ ఓటమి ఖరారైంది.

ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 387 పరుగులు చేసింది. భారత్ కూడా తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులతో సమం చేసింది. ఇక, ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 192 పరుగులకు ముగిసింది. దాంతో భారత్ ముందు 193 పరుగుల లక్ష్యం నిలిచింది. కానీ బ్యాట్స్ మెన్ వైఫల్యంతో టీమిండియాకు తీవ్ర నిరాశ తప్పలేదు.

**సంక్షిప్త స్కోర్లు:**

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387 ఆలౌట్ (జో రూట్ 104, బుమ్రా 5/74)

భారత్ తొలి ఇన్నింగ్స్: 387 ఆలౌట్ (కేఎల్ రాహుల్ 100, వోక్స్ 3/84)

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 192 ఆలౌట్ (జో రూట్ 40, వాషింగ్టన్ 4/22)

భారత్ రెండో ఇన్నింగ్స్: 170 ఆలౌట్ (జడేజా 61 నాటౌట్, స్టోక్స్ 3/48)

# తెలంగాణ రైజింగ్‌లో సినిమా రంగానికి ప్రత్యేక స్థానం



**సీఎం రేవంత్ రెడ్డి**

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణను టాలీవుడ్, బాలీవుడ్ కాకుండా హాలీవుడ్‌కు సరిపోయే సినిమా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్‌లో సినిమా రంగానికీ ప్రత్యేక చాప్టర్ కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన "రామాయణం" సీరియల్‌ను నిర్మించిన సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తెరకెక్కించనున్న "శ్రీమద్భాగవతం – పార్ట్ 1" సినిమా ముహూర్తాన్ని ముఖ్యమంత్రి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ వేడుక రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సలహాదారు వేంకట నరేందర్ రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ చెరుకూరి విజయేశ్వరి, ఈనాడు సంస్థల ఎండీ చెరుకూరి కిరణ్, సాగర్ పిక్చర్స్ ప్రతినిధులు ఆకాశ్ మోతీ సాగర్, అమృత్ సాగర్, సీఈఓ ఆకాశ్ సాగర్ చోప్రా, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "రామాయణం, భాగవతం, మహాభారతం మన జీవితం, సంస్కృతిలో భాగంగా ఉన్న ప్రతిష్టాత్మక గ్రంధాలు. అటువంటి కథను ఆధారంగా చేసుకుని నిర్మించబడే శ్రీమద్భాగవతం చిత్రం అందరికీ ప్రేరణగా నిలుస్తుంది," అని పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితం రామానంద సాగర్ నిర్మించిన రామాయణం ప్రసారం సమయంలో దేశవ్యాప్తంగా రహదారులపై జనజీవనం నిలిచిపోయిన సందర్భాన్ని గుర్తుచేశారు. కోవిడ్ సమయంలో ఆ సీరియల్ మళ్లీ ప్రసారమై ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వీక్షణ రేటు నమోదు చేసినట్టు చెప్పారు.

**"శ్రీమద్భాగవతం" సినిమాను మించి రికార్డు సృష్టించాలి**

"ఇప్పుడు మూడో తరం వారు శ్రీమద్భాగవతాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. ఈ చిత్రం రామాయణం కంటే గొప్ప విజయాన్ని సాధించాలి. రాష్ట్ర ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం అందుతుంది," అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

**తెలంగాణకు సినిమా కేంద్రంగా గుర్తింపు**

"తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌లో సినిమా రంగానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణ గర్వంగా నిలుస్తోంది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణను అంతర్జాతీయ స్థాయి సినిమా కేంద్రంగా తీర్చిదిద్దుతాం," అని సీఎం తెలిపారు.

# సీనియర్ నటి బి సరోజాదేవి కన్నుమూత..

బలగం టీవీ, హైదరాబాద్



అలనాటి ప్రముఖ నటి బి.సరోజాదేవి(87) కన్ను మూశారు. వృద్ధాప్యం కారణంగా పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు.సోమవారం ఉదయం బెంగళూరులోని తన నివాసంలో సరోజాదేవి తుదిశ్వాస వదిలారు. 1940 జనవరి 7న బెంగళూరులో జన్మించిన సరోజాదేవి చిన్నతనంలోనే శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్చుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించిన సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎంజీఆర్‌లతో కలిసి స్క్రీన్ షేర్ చేసారు. 1955లో సినీరంగంలోకి అడుగుపెట్టి, కొద్ది కాలంలోనే అగ్రనటిగా ఎదిగిన ఆమె, దక్షిణాది సినిమాల వెలుగుతీరుగా నిలిచారు. ఆమె 1957లో'పాండురంగ మహాత్మ్యం' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టి, అదే ఏడాది 'భూకైలాస్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో కలిసి 'పెళ్లిసందడి' , 'జగదేకవీరునికథ' , 'మంచి చెడు' , 'దాగుడు మూతలు','శకుంతల', 'సీతారామకల్యాణం', 'దానవీరశూరకర్ణ' వంటి అనేక హిట్ సినిమాల్లో నటించారు. 1963లో ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో కలిసి 'శ్రీకృష్ణార్జునయుద్ధం' సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. సరోజాదేవి తమిళ పరిశ్రమలోనూ తనదైన స్థానం సంపాదించారు. తమిళ సూపర్‌స్టార్ ఎంజీఆర్‌తో కలిసి ఏకంగా 26 సినిమాల్లో నటించి అరుదైన రికార్డు నెలకొల్పారు. అలాగే శివాజీ గణేషన్‌తో 'శభాష్ మీనా', 'పుది పరవై' వంటి సినిమాల్లో